వర్ష బీభత్సం


హిందూపురంలోని అహమ్మద్‌నగర్‌లో ఓ వీధిలో పారుతున్న వర్షపు నీరు


లేపాక్షి: నీట మునిగిన పంట పొలాలు

- హిందూపురంలో 74.06 మి.మీ వర్షం
- పలు కాలనీలు జలమయం
- పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోనూ వర్షాలు
- పొంగిపొర్లిన వాగులు, వంకలు

హిందూపురం: వాన దంచికొట్టింది. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ వర్షం కురిసింది. పెనుకొండ డివిజన్ పరిధిలో అత్యధికంగా హిందూపురంలోనే 74.06 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. పెనుకొండ 57 మి.మీ, సోమందేపల్లి 50.4 మి.మీ, లేపాక్షిలో 37.2 మి.మీ, చిలమత్తూరు 32.6 మి.మీ, పరిగి 45.2 మి.మీ, రొద్దం 25.4 మి.మీ, అగళి 10.6 మి.మీ, మడకశిరలో 9.8 మి.మీటర్ల వర్షం పడింది.

పట్టుగూళ్ల మార్కెట్ జలమయం

ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న పట్టుగూళ్ల మార్కెట్ జలమయంగా మారింది. సోమవారం రాత్రి నుంచి దూరప్రాంతాల నుంచి రైతులు పట్టుగూళ్లను తీసుకువచ్చి మార్కెట్‌లో వేలాలకు ఉంచారు. అయితే తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి గూళ్ల మార్కెట్ వర్షపు నీటితో నిలిచిపోయి మడుగులా మారింది. రైతులు తెచ్చిన గూళ్లలన్నీ నీట మునిగాయి. తీవ్రనష్టం వాల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లేపాక్షి: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి వంకలు, వాగులు, పంట పొలాల్లో నీటితో నిండాయి. మండల వ్యాప్తంగా 37.2 మి.మీ వర్షపాతం నమోదైందని ఏఓ శ్రీలత తెలిపారు. కల్లూరు సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న పంట పొలాలు వర్షపు నీటితో నిండిపోయాయి.

పరిగి: మండలంలో మంగళవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వర్షపు నీరు చేరి, కాలువలు పొంగిపొర్లాయి. ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం ప్రధాన ద్వారం రోడ్డుపై బురద నీరు చేరింది. పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు బురదనీటిలోనే నడిచి వెళ్లాల్సి వచ్చింది. మోదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే మట్టి రోడ్డుపై నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కురవడంతో మండలంలోని రైతాంగంతో పాటు పాడి రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సోమందేపల్లి: మండల వ్యాప్తంగా సోమవారం అర్ధ రాత్రి భారీ వర్షం కురిసింది. దాదాపు 50.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం దెబ్బకు తహసీల్దార్ కార్యాలయ ప్రహరీ కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పలు చోట్ల వంకలు, చెరువుల్లో ఉన్న గుంతల్లోకి నీరు చేరాయి.

పెనుకొండ రూరల్: మండలంలో సోమవారం అర్ధ రాత్రి భారీ వర్షం కురిసింది. చంద్రగిరి, గొల్లపల్లి, అడదాకులపల్లి, మావటూరు గ్రామాల్లోని రైతుల పొలాల్లో వర్షపు నీరు నిలబడింది. మండల వ్యాప్తంగా 57 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

లోతట్టు ప్రాంతాలన్నీ...

మంగళవారం తెల్లవారుజామున ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి హిందూపురం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపునీరు చేరాయి. దీంతో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోయింది. ముఖ్యంగా ముక్కిడిపేట, అహమ్మద్‌నగర్, బాలాజీనగర్, ఎన్టీఆర్ కాలనీ, టీచర్స్‌కాలనీ, మేళాపురం తదితర ప్రాంతాలన్నీ జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముక్కిడిపేటలో వర్షపు నీరు ఇళ్లలోకి రావడంతో అక్కడి ప్రజలు తెల్లవార్లూ నీటిని బయటకు తోడేసుకుంటూ జాగరణ చేయాల్సి వచ్చింది. ముక్కిడిపేట వద్ద పెద్దకాలువ మరమ్మతులు పేరిట అవగాహన లేకుండా ఎత్తుపెంచేయడంతో నీరు వెళ్లడానికి దారి లేక రహదారిలోనే నీళ్లు నిలిచి ఇళ్లలోకి వచ్చాయని స్థానికులు వాపోతున్నారు. మేళాపురంలో కూడా లోతట్టు ప్రాంతమంతా జలయమం అయింది. దీప్తి స్కూల్ గ్రౌండ్ మడుగును తలపించింది. బసవనపల్లి స్కూల్ వద్ద కూడా వర్షపు చేరిపోవడంతో ప్రహరీ కూలిపోయింది.


సోమందేపల్లి: కూలిన తహసీల్దార్ కార్యాలయ ప్రహరీ


పెనుకొండ మండలం చంద్రగిరిలో పారుతున్న వంక


పరిగి మండలం ధనాపురం జెడ్పీ స్కూల్ వద్దకు చేరిన వర్షపు నీరు


హిందూపురంలోని పెనుకొండ రోడ్డులో నిలిచిన నీరు


హిందూపురంలోని ముక్కిడిపేటలో ఇంట్లోకి చేరిన వర్షపు నీటిని తోడేస్తున్న దృశ్యం


లేపాక్షి పరిధిలోని వంకలో నిలిచిన నీరు


హిందూపురం మండలం బసవనపల్లిలో కూలిన స్కూల్ ప్రహరీ


హిందూపురంలోని దీప్తి పాఠశాలలోకి చేరిన వర్షపు నీరు

క్లుప్తంగా

శ్రీరామిరెడ్డికి ఘన నివాళి


దేశభక్తి గీతం పాడుతున్న విద్యార్థులు

మడకశిరరూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ శ్రీరామిరెడ్డి 31వ వర్ధంతిని మండలంలోని నీలకంఠాపురంలో మంగళవారం నిర్వహించారు. పెద్దనాన్న శ్రీరామరెడ్డి సమాధి వద్ద మాజీ మంత్రి ఎన్ రఘువీరారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపించారు. శ్రీరామిరెడ్డి సేవలను గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు.

ఆర్భాటం తప్ప అభివృద్ధి ఎక్కడ?


అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న దృశ్యం

మడకశిర: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంలో ఆర్భాటం తప్ప అభివృద్ధి ఏమాత్రం లేదని సీపీఐ తాలూకా కార్యదర్శి పవిత్ర ధ్వజమెత్తారు. పట్టణంలోని రోడ్లకు పడిన గుంతలను పూడ్చాలంటూ మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సీపీఐ, సీపీఎం కార్యకర్తలు నిరసన తెలిపారు. రోడ్లను దిగ్బంధనం చేసి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవిత్ర మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దళితవాడల్లో పర్యటించినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గుంతలు పడిన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకుని రోడ్లను బాగు చేయాలని కోరారు. సీపీఎం నాయకుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు పూర్తి చేయండి


ఈ పంట నమోదుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మి

లేపాక్షి: ఈ పంట నమోదుతోనే అన్ని ప్రభుత్వ పథకాలకు అర్హత సాధ్యమని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, వ్యవసాయాధికారి శ్రీలత తెలిపారు. మంగళవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఈ పంట నమోదుపై వీఆర్ఓలు, సర్వేయర్లు, వ్యవసాయ సహాయకులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వచ్చే నెల 15వ తేదీలోపు పంట నమోదు చేసి రైతులతో ఈ–కేవైసీ ప్రక్రియను కూడా పూర్తి చేయించాలని సూచించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

గుడిబండ: మండల పరిధిలోని జంబులబండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'బాలికలను చదివిద్దాం– బాలికలను రక్షిద్దాం' అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం బాలికలకు అవగాహన కల్పించారు. సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ ఆడపిల్లలు బాగా చదుకోవాలని, మంచి ఆహారాన్ని తిని ఆరోగ్యంగా, బలంగా ఆత్మస్థైర్యంతో ఉండాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలు చేయాలని చూస్తే బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం బాల్య వివాహం చేసుకున్నా, సహకరించినా, హాజరైనా ప్రతి ఒక్కరూ శిక్షార్హులు అన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం ముందస్తు చర్యలుగా గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్, ఆర్డీటీ టీమ్ లీడర్ ఆదినారాయణ, సూపర్‌వైజర్ కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎండిన చెట్టును తొలగించండి


ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలలో ఎండిపోయిన చెట్టు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలలో ఎండిపోయిన చెట్టును తొలగించి పాఠశాల భవనాలు, ప్రహరీ దెబ్బతిన్నకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. అటు వైపు విద్యార్థులు, ఉపాధ్యాయులు వచ్చిన సమయంలో కొమ్మలు పడితే ప్రమాదం జరిగే ఆవకాశం ఉంటుందన్నారు.

సేంద్రియ ఎరువుతో సంపద సృష్టి


మడకశిర మండలం కదిరేపల్లి సంపద తయారీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం


చిలమత్తూరు: ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ తీసుకుంటున్న సర్పంచులు, కార్యదర్శులు

మడకశిరరూరల్: మండలంలోని సర్పంచులకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చెత్త నుంచి ఎరువు (సంపద) తయారు చేసే విధానంపై కదిరేపల్లి సంపద తయారీ కేంద్రంలో గ్రామ కార్యదర్శులు, సర్పంచులకు అవగాహన కల్పించారు. మండల పరిషత్ ఏఓ ఆరాధ్య సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు గ్రామ పరిశుభ్రత, అభివృద్ధిపై వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, కార్మికులు పాల్గొన్నారు.

రొళ్ల: సేంద్రియ ఎరువుల ద్వారా సంపద సృష్టించి గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని మండల ప్రజా పరిషత్ ఏఓ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రొళ్లకొండ గ్రామ సమీపాన గల సంపద తయారీ కేంద్రం వద్ద సర్పంచులకు రెండోరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా వర్మి కంపోస్టు (సేంద్రియ ఎరువులు) తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు వ్యర్థ పదార్థాలను వృథా చేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. అందులో వేర్వేరుగా ఉంచి తడి, పొడి చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించి వాన పాముల సహాయంతో వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసుకుని రైతులకు విక్రయించాలన్నారు. దాని ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నెలకున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

అమరాపురం: మండలంలోని గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన చెత్తతో సంపద తయారీ కేంద్రాలను ఏవిధంగా నిర్వహించాలి అనే అంశంపై ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, వాటి నుంచి రైతులకు ఏవిధమైన ఉపయోగం ఉంది? తదితర వాటి పై శిక్షణ ఇచ్చారు. అనంతరం మండలంలోని హేమావతి గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ గోవిందరాయ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లు, కార్యదర్శులకు గ్రామ పరిపాలన, పారిశుధ్యం, పంచాయితీల అభివృద్ధి వంటి అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈఓఆర్డీ ఈశ్వరయ్య వారికి శిక్షణ ఇచ్చారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు వెళ్లి అక్కడ చెత్త సేకరణపై అవగాహన కల్పించి వారితో ప్రతిజ్ఞ చేయించారు.

ప్రణాళికతో చదివితే లక్ష్యాన్ని చేరవచ్చు

- సీనియర్ సివిల్ జడ్జి బొజ్జప్ప


రొద్దం కేజీబీవీని సందర్శిస్తున్న జడ్జి బొజ్జప్ప

రొద్దం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయాన్ని మంగళవారం సాయంత్రం పెనుకొండ సీనియర్ సివిల్ జడ్జి బొజ్జప్ప సందర్శించారు. పాఠశాలలోని సమస్యలపై విద్యార్థినులతో ఆరా తీశారు. పాఠశాలలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? ప్రిన్సిపాల్ రాత్రి వేళ అందుబాటులో ఉంటున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. వంట గది, భోజన శాల శుభ్రతను పరిశీలించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జడ్జి బొజ్జప్ప మాట్లాడుతూ అవకాశాలను అందిపుచ్చుకుని ప్రతి విద్యార్థి ప్రణాళికతో చదువుకుంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. పాఠశాల వెనక భాగాన ప్రహరీ ఎత్తు పెంచడానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థునులు జడ్జి దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంట ఎస్ఐ వలీబాషా, కానిస్టేబుళ్లు అనిల్ కుమార్‌రెడ్డి, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మృతి


రవికుమార్ మృతదేహం

మడకశిర: మడకశిర ఆర్టీసీ డిపోలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రవికుమార్ (60) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఈ నేపథ్యంలోనే మెడికల్ లీవ్ తీసుకుని కదిరిలో నివాసం ఉంటున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. అయితే మంగళవారం పరిస్థితి విషమించడంతో చనిపోయినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రవికుమార్ మృతికి ఇన్‌చార్జ్ డీఎం శ్రీకాంత్, స్థానిక కార్మిక సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

సందడిగా ఫ్రెషర్స్ డే


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

రొద్దం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొదట సంవత్సరంలోకి చేరిన విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను అందరినీ ఆకట్టుకున్నాయి.

జాతీయ జెండా ప్రదర్శన


జిల్లేడుగుంటలో 78 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మడకశిరరూరల్: మండలంలోని జిల్లేడుగుంట ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు 78 అడుగుల జాతీయ జెండాను గ్రామంలో ప్రదర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులు జాతీయ జెండాతో ట్రైల్ ర్యాలీ నిర్వహించినట్లు హెచ్‌ఎం భూతన్న తెలిపారు.

లేపాక్షిలో విద్యార్థుల ర్యాలీ

లేపాక్షి: 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక లేపాక్షిలోని ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. గురుకుల పాఠశాల నుంచి బస్టాండు వరకూ ర్యాలీ కొనసాగింది.


జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

రోడ్డుపైనే మురుగు


నడవడానికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

పెనుకొండ: పట్టణంలో మురుగు సమస్య తీవ్రతరమవుతోంది. పట్టణంలోని బోయగేరి, కుమ్మరగేరి, ఎస్సీ కాలనీ, దర్గాపేట తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారిలో ఎక్కడికక్కడ పట్టణం నుంచి వచ్చే మురుగు నీరు పట్టణం నుంచి బయటకు వెళ్తోంది. అయితే ఆయా చోట్లా భూముల యజమానులు మురుగుకు అడ్డుకట్టవేశారు. దీంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు, విద్యార్థులు, మహిళలు ప్రతిరోజూ నరకయాతన అనుభవిస్తున్నారు. పట్టణంలో ఇది ప్రధాన రహదారి కావడంతో ప్రజల బాధలు వర్ణణాతీతంగా మారాయి.

ఇద్దరికి తీవ్రగాయాలు

మడకశిరరూరల్: పట్టణ పరిధిలోని జాతీయ రహదారిలోని హరేసముద్రం క్రాస్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. యూ.రంగాపురం వైపు నుంచి బుళ్లసముద్రం గ్రామానికి నరేష్‌తో పాటు మరొకరు ద్విచక్ర వాహనంలో వస్తుండగా మార్గ మధ్యలోని హరేసముద్రం క్రాస్ సమీపంలో రోడ్డుకు అడ్డంగా వచ్చిన పశువులను తప్పించబోయి కింద పడ్డారు. తీవ్రంగా గాయపడటంతో వారిని చికిత్స నిమిత్తం బెంగళూరు తరలించారు. ఇరువురు బుళ్లసముద్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

గుడిబండ: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని పుట్టపర్తి డైట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని నాచేపల్లిలోని రైతు శివకుమార్ సాగు చేసిన పత్తి పంటను మడకశిర వ్యవసాయశాఖ ఏడీఏ కృష్ణమీనన్‌తో కలిసి పరిశీలించారు. తర్వాత రైతులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైంటిస్ట్ డాక్టర్ రామసుబ్బయ్య రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఏఓ వీరనరేష్, రైతు సేవా కేంద్రం అధికారి మూర్తి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు


పెనుకొండ: అలంకరణలో గంగమ్మ


రత్నగిరి కాళికాంబాదేవి


జంబులబండ మారెమ్మదేవి

సాక్షిబృందం: శ్రావణమాసం సందర్భంగా హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో అమ్మవార్ల ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించడంతో భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.


వేరుశనగ గంధం అలంకరణలో వాసవీదేవి

నాగలమడక వీఎస్ఎస్ఎన్ హస్తగతం

పావగడ: తాలూకాలోని నాగలమడక గ్రామం వీఎస్ఎస్ఎన్ సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. 12 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 10 స్థానాలను కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుని విజయభేరి మోగించింది. ప్రతి పక్ష జేడీఎస్ పార్టీ రెండు స్థానాలకే పరిమితమైంది. కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు పెద్దారెడ్డి, పాలనాయక్, అశోక్ కుమార్, లక్ష్మీనారాయణ, మంజుల, శ్రీరామప్ప, గౌరమ్మ, పుష్పాబాయి, రవి కుమార్, నాగరాజు గెలుపొందారు. కాంగ్రెస్ గెలుపుపై స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప, రూరల్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామాంజినప్ప హర్షం వ్యక్తం చేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

మడకశిర: మండలంలోని గుండుమల, గోవిందాపురం, గంగులవాయిపాళ్యం గ్రామ పంచాయతీల పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించండి అని ఎంపీడీఓ సోనిబాయికి మాజీ సర్పంచు చంద్రప్ప, ఎంపీటీసీ పాండురంగప్ప తదితరులు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. దిన్నమీదపాళ్యం, సిద్దాపురం గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220717, 9912220723, 9705346587
9010200238, 9912220726